

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | గురువారం | నవంబర్ 9, 2023 | www.navatelangana.com



ఊపందుకున్న నామినేషన్ల పర్వం

- ఒక్క రోజే 30 నామినేషన్లు
- దాఖలుగా మరో రెండు రోజులే గడువు

2లో...



కచ్చితంగా హ్యాట్రిక్ సాధిస్తాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- దిలావర్‌పూర్ మండలంలో ఎన్నికల ప్రచారం

4లో...

తొలి విడత ముగిసింది..మలి విడత మిగిలిం..!



- ఆరు నియోజకవర్గాల్లో ముగిసిన సీఎం పర్యటన
- ప్రతిపక్షాలు, కేంద్రం తీరుపై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్ అభ్యర్థులను మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి
- ఉమ్మడి జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని భరోసా

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కాగజ్‌నగర్

భారత రాష్ట్ర సమితి అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ చేపడుతున్న తొలి విడత పర్యటన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముగిసింది. ప్రజా ఆశీర్వాద సభల పేరిట ఉమ్మడి జిల్లాలోని

మిగతా..2లో...





కాంగ్రెస్ జెండా ఎగరాలి..!





- జోగు రామన్న మంచోడు కాకపోతేనే మంత్రి పదవి ఇవ్వలేదు
- ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదు
- కాంగ్రెస్‌ను గెలిపిస్తారనే సంపూర్ణ విశ్వాసం ఉంది
- టికెట్లు దక్కని నాయకులకు సముచిత స్థానం కల్పిస్తాం
- టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- విజయభేరి సభకు భారీగా హాజరైన జనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి. ప్రజలు గెలిపిస్తారనే సంపూర్ణ విశ్వాసం ఉంది. గత పదిహేనేండ్లుగా ఎమ్మెల్యే జోగు రామన్ననే ఎమ్మెల్యేగా ఉన్నారు..ఆయన మంచోడైతే మంత్రి పదవి నుంచి ముఖ్యమంత్రి ఎందుకు తొలగిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ దృష్టిలో జోగు రామన్న తప్పు చేశారనే అభిప్రాయం ఉందని తెలిపారు. జోగు రామన్నను ఓడించి..కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికే భారీ సంఖ్యలో జనం వచ్చారని

మిగతా..2లో...



ఊపందుకున్న నామినేషన్ల పర్వం..!

- ఒక్కరోజే 30 నామినేషన్లు
- దాఖలుగా మరో రెండురోజులే గడువు



సిర్పూర్(టి)లో ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తరపున నామినేషన్ వేస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ అభ్యర్థులుగా బరిలో దిగేందుకు అనేక మంది ఉత్సాహం చూపిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉమ్మడి జిల్లాలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. ఆయా నియోజకవర్గాల్లో ఒక్కరోజే 30మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఒక్కరోజే 10నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ నుంచి జోగురామన్న, కాంగ్రెస్ నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నుంచి పాయల్‌శంకర్(రెండోసెట్), ధర్మసమాజ్ పార్టీ నుంచి అగ్గిమల్ల గణేష్, ప్రజాఏక్తాపార్టీ నుంచి కేమ శ్రీనివాస్, బీఎస్పీ ఉయిక ఇందిరా, బీఎంపీ నుంచి సూర్యవంశీ, స్వతంత్ర అభ్యర్థులుగా రాజేశ్వరరావు, అస్లాం, సుభాష్‌లు దాఖలు చేశారు. నిర్మల్‌లో 5 నామినేషన్లు రాగా ధర్మసమాజ్ పార్టీ నుంచి రవీందర్ రామగిరి, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి పరికిపండ్ల స్వదేశ్, స్వతంత్ర అభ్యర్థులుగా దేవొళ్ల రాజు, సుదర్శన్, ఎస్.పృథ్వీరాజ్‌వర్మలు దాఖలు చేశారు. చెన్నూర్‌లో నాలుగు దాఖలయ్యాయి. ఆల్ ఇండియా ఫార్వడ్ బ్లాక్ నుంచి సోగాల సంజీవ్, తెలంగాణ రాజ్య సమితి నుంచి వడ్లకొండ రాజాం, ప్రజారాజ్య సమితి నుంచి సల్లూరి మహేష్, స్వతంత్ర అభ్యర్థిగా జామిడి గోపాల్ దాఖలు చేశారు. సిర్పూర్(టి)లో బీజేపీ నుంచి పాల్వాయి హరీష్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ నుంచి వెడ్మబొజ్జు పటేల్, సీపీఐ ఎంఎల్(రెడ్‌స్టార్) పెందోర్ ప్రియాంక నామినేషన్ దాఖలు చేశారు. బోథ్‌లో ధర్మసమాజ్ పార్టీ నుంచి ఉయికే ఉమేష్, స్వతంత్ర అభ్యర్థిగా తొడసం ధనలక్ష్మి దాఖలు చేశారు. బెల్లంపల్లిలో మూడు దాఖలయ్యాయి. ధర్మసమాజ్ పార్టీ నుంచి జంగపెల్లి రామస్వామి, స్వతంత్ర అభ్యర్థులుగా కొండగొర్ల వేద ప్రకాష్, పెరుగు రవీందర్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుంచి ఆజ్మీరా ఆత్మారాం నాయక్, ఆజ్మీరా సంధ్య, స్వతంత్ర అభ్యర్థిగా సిడాం అన్నిగా దాఖలు చేశారు. ముధోల్, మంచిర్యాలలో ఒక్కటి కూడా నామినేషన్లు దాఖలు కాలేదు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బూసి భూమన్న, బన్నవోయిన పెద్దోల పోశెట్టి ఆధ్వర్యంలో బుధవారం పలువురు బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు రాందిన్ రవీందర్, పాండు నరహరి, బన్నెవోయిన రమేష్ తదితరులు పెద్ద ఎత్తున నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సమ్మెట రవి, నగేష్, వినేష్, సురేష్, బబ్లు, రాజేందర్ పాల్గొన్నారు.

10కిలోల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్ వద్ద మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు బస్వంతే అనిల్, తొంబారే గౌతమ్ 10కిలోల గంజాయి విక్రయానికి ప్రయత్నించగా పోలీసులు పట్టు కున్నట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పోలీస్ బృందంతో దాడి చేసి గంజాయి పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారి మీద కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఎస్ఐతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నిగిని గ్రామానికి చెందిన కాళ్లే జైవంత్‌రావు(40) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జైవత్‌రావు తాగుడుకు బానిసై మంగళవారం రాత్రి మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాములు తెలిపారు.

తొలి విడత ముగిసింది..మలి విడత మిగిలింది..!

(మొదటి పేజీ తరువాయి)



ఆరు నియోజకవర్గాల్లో పర్యటించిన సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వజ్రాయుధం లాంటి ఓటును పార్టీల చరిత్ర, వాటి స్వభావం, అభ్యర్థుల వ్యక్తిత్వం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని వేయాలని సూచించి ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. పరిణతితో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లోనూ పర్యటించే షెడ్యూల్ ఖరారైంది.

ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికను అన్ని పార్టీల కంటే ముందే ప్రకటించిన బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో ఆయన పర్యటించి బహిరంగ సభలలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ముథోల్, చెన్నూరు, సిర్పూరు(టి), ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. రెండో విడతలో మంచిర్యాల, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాలలో ఆయన పర్యటించనున్నారు. తొలి విడతలో ఆయన పర్యటన ఆసాంతం ప్రతిపక్షాలను, కేంద్రాన్ని లక్ష్యంగా చేసే విధంగానే సాగింది. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ తీరు పైనే ప్రధానంగా ఆయన విమర్శలు చేశారు. తాము వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తే కాంగ్రెస్ వాళ్లు అవసరం లేదని అంటున్నారు. మరి మీకు కరెంట్ కావాలా, వద్దా అని ప్రజలనే ప్రశ్నిస్తూ వారిచేతే కావాలని చెప్పించుకోవడం, ధరణిని తీసేస్తే పైరవీల రాజ్యం వస్తుందని చెప్పి ప్రజలను, రైతులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా జిల్లాలో పోడు భూముల సమస్య అధికంగా ఉండడంతో దానిని ప్రస్తావిస్తూ గిరిజనులకు పట్టాలిచ్చామని, ఆ భూములకు రైతుబంధు, రైతుభీమా కూడా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. గిరిజనేతరులకు పట్టాలిచ్చేందుకు తాము అడ్డు కాదని, కేంద్రమే అడ్డు పడుతోందని అన్నారు. జిల్లాలో విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రంలో 1019 గురుకులాలను ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థిపై రూ. 1.25 లక్షలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మైనార్టీల అభివృద్ధికి రూ. 12 వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. తెల్లరేషన్‌కార్డు దారులకు భీమా కూడా వర్తింపచేయనున్నామని తెలిపారు.

ఆకట్టుకునే రీతిలో ప్రసంగం..!

ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ జనాలను ఆకట్టుకునే రీతిలో మాట్లాడారు. ఆయా నియోజకవర్గాల్లో గతంలో ఉన్న పరిస్థితి.. తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కేంద్రానికి 49శాతం వాటా కల్పించి ముంచిందని ప్రస్తావించడంతో పాటు తెలంగాణ వచ్చిన తర్వాత రూ. 2184కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని గుర్తుచేశారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో సింగరేణి కార్మికులను దృష్టిలో ఉంచుకొని ప్రసంగం చేశారు. అధికారంలోకి రాగానే పెర్క్ ట్యాక్స్‌ను మినహాయింపు ఇస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మకూడదని..నమ్మితే మోసపోయి గోసపడుతామని ప్రజలకు సూచించారు. అన్ని చోట్లా ముఖ్యమంత్రి సభలకు భారీ సంఖ్యలో జనాలు హాజరయ్యారు. సభా ప్రాంగణాలు జనంతో కిక్కిరిసిపోయాయి. సీఎం పర్యటనతో అభ్యర్థులతో పాటు గులాబీ శ్రేణుల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరాలి

(మొదటి పేజీ తరువాయి)



ఉట్నూర్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

వ్యాఖ్యానించారు. బుధవారం ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల కాంగ్రెస్ విజయభేరి సభలు నిర్వహించింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానం, ఉట్నూర్ కేంద్రంగా నిర్వహించిన ఈ సభలకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థులు కంది శ్రీనివాస్‌రెడ్డి, వెడ్మ బొజ్జుపటేల్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత ఉట్నూర్ సభలో ప్రసంగించిన రేవంత్‌రెడ్డి..మధ్యాహ్నం సమయంలో ఆదిలాబాద్‌లో మాట్లాడారు.

ప్రత్యేక రాష్ట్రంలోనూ ఆదిలాబాద్‌కు అన్యాయం

జల్,జంగల్, జమీన్‌కోసం పోరాడిన యోధుడు కుమురంభీం వీరత్వాన్ని చాటిన ఉమ్మడి జిల్లాకు తెలంగాణ రాష్ట్రంలోనూ న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబాటుకు గురైంది ఆదిలాబాద్ జిల్లానే అని గుర్తుచేశారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో 45వేల ఇండ్లు కాంగ్రెస్ ఇచ్చినవేనని..బీఆర్ఎస్ ఇండ్లు ఇచ్చిన చోట మేమే ఓట్లు అడగమని..కాంగ్రెస్ ఇచ్చిన చోట్ల బీఆర్ఎస్ అడగొద్దని సవాల్ విసిరారు. ఆదిలాబాద్ సాక్షిగా చెబుతున్నానని..ఇక్కడ 24గంటల కరెంటు అమలైతే.. నాతో పాటు అభ్యర్థి కూడా నామినేషన్ వేయరని స్పష్టం చేశారు. ఇప్పుడే సబ్‌స్టేషన్‌కు వెళ్లి లాగ్‌బుక్‌లు పరిశీలిద్దామని సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ మాయలో పడకూడదని.. ఇక్కడ జోగు రామన్నను ఓడిస్తేనే కేసీఆర్‌ను గద్దె దించొచ్చని సూచించారు. సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయలేదని..రేషన్‌కార్డులు జారీ చేయలేదని, ఆరోగ్యశ్రీ పథకం అమలు కావడం లేదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు.

ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తాం

ఆదిలాబాద్ నియోజకవర్గంలో నలుగురు టికెట్లు ఆశించారని, ప్రజల అభిప్రాయం, సర్వేల ప్రకారమే అధిష్టానం కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు చేసిందని గుర్తుచేశారు. టికెట్ దక్కలేదనే అసంతృప్తితో పార్టీని వీడకూడదని పరోక్షంగా గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవరెడ్డిలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పార్టీ బలోపేతంలో మీ కృషిచాలా ఉందని పార్టీ పదవులు కూడా ఇచ్చిందని తెలిపారు. ఇతరుల మాటలు విని పార్టీని వీడకూడదని విజ్ఞప్తి చేస్తున్నానని ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దివంగత మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి సైతం కంది శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తామని తనకు మాట ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో టికెట్ ఇవ్వలేకపోయామని ఇతరుల మాటలు విని పార్టీని వీడి ఎక్కడికి వెళ్లకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, మాజీ డీసీసీబీ ఛైర్మెన్ దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపల్లి శ్రీధర్, నాయకులు దిగంబర్‌రావుపాటిల్, నాయకులు ఆనంద్‌రావు, శాంతన్‌రావు, చరణ్‌గౌడ్, సామ రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా : కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదిలాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో 35వేల ఇంటిస్థలాలు, 45వేల ఇండ్లు ఇచ్చామని తెలిపారు. జోగు రామన్నకు దమ్ముంటే ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊరిలో ఓట్లు అడగవద్దని..డబుల్‌బెడ్‌రూంలు ఇచ్చిన ఊళ్లలో తాము ఓట్లు అడగబోమన్నారు. ఈ సవాల్‌కు సిద్ధమా అని ప్రశ్నించారు. జోగురామన్న, పాయల్ శంకర్ ఇద్దరూ ఒక్కటేనని వారిలో ఎవరికి ఓటేసినా మరో ఐదేండ్లు కష్టాలు తప్పవని పేర్కొన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నిండాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

రైతులు దళారులను నమ్మి వరి ధాన్యం అమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి(కే) గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు ఏ గ్రేడ్ రూ.2వేల 203, బి గ్రేడ్ రూ.2వేల 183 క్వింటాలుకి రైతులు తమ వరి ధాన్యం అమ్ముకోవాలని దళారుల దగ్గర తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సంతోష్, సెంటర్ ఇన్‌చార్జిలు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం



నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలాన్ని అన్ని రంగాల్లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముధోల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, ఎంపీటీసీలు బండారి గంగాధర్, ఆత్మస్వరుప్, నాయకులు రవిందర్‌రెడ్డి, పోతన్నయాదవ్, మురళీ, బోయిడి అనిల్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లకు తరలింపు



నవతెలంగాణ-ఖానాపూర్

మండల కేంద్రంలోని మాధవి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ నేతృత్వంలో ఉచిత కంటి ఆపరేషన్ల కోసం 10 మంది రోగులను ఆర్మూర్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రికి రోగులను తరలించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ తూము నిఖిత చరణ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్లు అవసరమైన వారని గుర్తించి, శస్త్ర చికిత్స నిమిత్తమై ప్రత్యేక వాహనంలో ఆర్మూర్‌కు తరలించారు. రోగులకు ఉచిత ఆపరేషన్లతో పాటు సహాయకులకు సహితం భోజన వసతి, ఉచిత రవాణ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత అధ్యక్షుడు సాదుల వెంకటస్వామి, జిల్లా అదనపు క్యాబినెట్ కోశాధికారి పాలెపు సుదర్శన్, జిల్లా చైర్మెన్ కారింగుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ తూము చరణ్, డాక్టర్ నిఖిత, శ్రీదేవి కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గన్నారు.

గెలుపే లక్ష్యంగా అందురూ పనిచేయాలి

నవతెలంగాణ-బాసర

గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు అఖిలేష్ పటేల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నారాయణరావు పాటేల్‌కు మద్దతు తెలుపుతూ ఎన్నికల్లో ముమ్మర ప్రచారం చేసి గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి కాంగ్రెస్ ఎన్నికల హామీలు ఆరు గ్యారంటీలను వివరించాలని మాజీ సర్పంచ్ రమేష్ కార్యకర్తలను కోరారు. గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ దేశ్‌ముఖ్, బీసీ సెల్ అధ్యక్షుడు రాందాస్, రాజేందర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను చూసి ఆదరించాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆదరించాలని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హంపోలి, సొనారి, అంతర్ని, గోడపూర్, పార్డి(కె)లో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథలకాలను ఆదరించి, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని కొత్త పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రైతుకలకు 24 గంటల పాటు నిరంతర ఉచిత కరెంట్ రైతుబంధు, రైతుబీమాతో పాటు రైతులకు మేలు కలిగించేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. వాటితో పాటు మహిళలకు వంట గ్యాస్ రూ.400కే ఇస్తామని అన్నారు. రూ.15లక్షలతో ఆరోగ్యబీమా, కల్యాణలక్ష్మీ, షాధీముబారక్, రూ.లక్ష కుల సంఘాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజక వర్గాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నో సంవత్సరాలుగా చేయని పనులను కేవలం 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, వ్యవసాయ సహకార సంఘం రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, బీఆర్ఎస్ నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు టాప్ గేర్‌లో దూసుకుపోతోంది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

నవతెలంగాణ-కడెం

ప్రచారంలో కారు టాప్ గేర్‌లో దూసుకుపోతుంటే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పత్తా లేకుండా పోతున్నాయని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారును సారును తెలంగాణ ప్రజలు వదలరని ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్‌కే ప్రజలు పట్టం కడతారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామి నిలిపారని తెలియజేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పడుతానని అని తెలిపారు. ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, పలు గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్‌ల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ మీడియా సెంటర్, కాల్ సెంటర్‌ను ఇతర అన్ని ఎన్నికల విభాగాలను జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఎన్నికల అబ్జర్వర్ నిర్మల్ జిల్లాకు రానున్న సందర్భంగా అన్ని విభాగాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్న ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘన జరగకుండా చుడాలన్నారు. వివిధ అనుమతుల కొరకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. వివిధ వీడియోలు, టెలివిజన్‌లలో ప్రసారమయ్యే ఇంటర్వ్యూలు, రాజకీయ పరమైన కార్యక్రమాలను పరిశీలించాలని అధికారలను ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లో 16 లొకేషన్‌లలో 32 కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో తిరుమల, ఈడీఎం నదీమ్, కంట్రోల్ రూమ్ సీసీ కెమెరా ఆపరేటర్ ముత్యం, జీపీఎస్ వెహికిల్ ఆపరేటర్ నరేష్, ఎఫ్ఎస్‌టీ మానిటరింగ్ ఆపరేటర్ నవతేజ పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD

ABR No.87 of 2023

Between:
M/s.Mahija Chit Fund (Indur) Pvt. Ltd., Nizamabad represented by its Foreman Mr.B.Komaraiah .. Disputant

And

D.Raj Kumar and others .. Opponents

To.
Opp.No.1. Dharmapuri Raj Kumar S/o.Rama Swamy, aged about 38 years, Occ:Business, R/o.H.No:10-62, Boigally, Vill&Mdl: Mudhole, Dist:Nirmal. Cell No.8886888095.
Opp.No.3. Pawar Dushanth S/o.Narayan, aged about 53 years, Occ:Service, Non-Public Health Worker, O/o. Municipal Council, Vill&Mdl: Bhainsa, Dist:Nirmal. Cell No.8106023394.
Opp.No.4. Gattolla Chinni Prasad S/o.Bapu Rao, aged about 39 years, Occ:Service, Police Constable AR-2910, AR Nirmal, Dist:Nirmal. Cell No.9676661245.
Opp.No.5. Akula Anjaiah Goud S/o.Sathyanarayana Goud, aged about 48 Years, Occ:Business, R/o.H.No.1-32/1, Master Colony, Vill&Mdl: Mudhole, Dist:Nirmal.Cell No.9000555303.

The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on 15.11.2023 at 11.00 A.M. You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/Arbitrator, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

// By Order of the Deputy Registrar of Chits/Arbitrator //

Sd/-
Deputy Registrar of Chits/Arbitrator, Kavitha Complex, Nizamabad.

నవతెలంగాణ

మాజీ మున్సిపల్ చైర్మన్ బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కావేటి సాయిలీల బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక ఎస్పీఎం మైదానంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో ఆమె బీఆర్ఎస్‌లో చేరగా, సీఎం పార్టీ కండువా కప్పారు. ఆమెతో పాటు ఆమె ముగ్గురు కుమారులు కావేటి మనోహర్, సతీష్, విజయ్‌లకు కూడా సీఎం కేసీఆర్ కండువా కప్పారు. మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య సతీమణి అయిన కావేటి సాయిలీల 2000 నుండి 2005 వరకు కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగారు. 2009, 2010లో కావేటి సమ్మయ్య టీఆర్ఎస్ నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్ నుండి పోటీ చేసి ఓడిపోయారు. 2018లో కావేటి సమ్మయ్యను కాదని, కేసీఆర్ కోనేరు కోనప్పకు టిక్కెట్ ఇవ్వడంతో సమ్మయ్య అప్పట్లో పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సమ్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబం రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చింది. ప్రస్తుతం కావేటి సాయిలీలతో పాటు ఆమె ముగ్గురు కుమారులు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

- తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీని ఆదరించాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ పార్టీకి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం మండలంలోని వాడ్యాల తండ, రాచపూర్, పీచర, ధర్మారం, పార్‌పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రచారంలో భాగంగా గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభయ హస్తం హామీలను, 6 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ప్రతీ ఒక్కరిని పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమి లేదని ఏద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రతీ ఒక్కరూ ఆదరించాలనానరు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అట్ల రవీందర్ రెడ్డి, సమ్మెట రవి, నగేష్, పృథ్వి పాల్గొన్నారు.

స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల ఉన్నత పాఠశాలను అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి రానున్న వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రోజు రెండు పూటలు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధగా చూపి వారు మెరుగయ్యేలాగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలాగా ఉపాధ్యాయుల కృషి చేయాలని సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు రాజేష్ నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి నవిత, సీఆర్పీ మహేందర్ పాల్గొన్నారు.

కచ్చితంగా హ్యాట్రిక్ సాధిస్తాం

- మంత్రి అల్లోల ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

కచ్చితంగా హ్యాట్రిక్ విజయం సాధిస్తామని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాల్వ గ్రామంలోని లక్ష్మినర్సింహాస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాల్వ, కాల్వ తండా, సిర్గాపూర్, మల్లాపూర్, ఒడ్డెపల్లి, సాంగ్వి, కంజర్, బన్సపల్లి గ్రామాల్లో రోడ్ షోలో పాల్గొన్నారు. కాల్వ గ్రామానికి చెందిన బీజేపీకి చెందిన 70 మంది యువత ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మహిళలు హారతులతో నీరాజనం పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, కేసీఆర్ భరోసా కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. ప్లకార్డులతో ప్రభుత్వ పథకాలు వివరించారు. వృద్ధులు, మహిళలను కలుస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పల్లెల రూపురేఖలు మారాయని, సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. రైతుబీమా, రైతుబంధు, రుణ మాఫీ, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పెన్షన్లు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌కు మూడవసారి అధికారం ఇవ్వాలని కోరారు. క్యాడర్, లీడర్లు లేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ధరికి రానివ్వకూడద్దని తెలిపారు. తెలంగాణ అభివద్ధికి ఒక్క రూపాయి ఇవ్వని బీజేపీ నాయకులు ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాల్వ లక్ష్మినర్సింహా స్వామి దేవాలయ అభివృద్ధికి మూడు కోట్ల రూపాయల నిధులు ఇచ్చామని గుర్తు చేశారు. 90కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ కచ్చితంగా చేపట్టి బంగారు పంటలు పండే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, వైస్ ఎంపీపీ బాబురావు, పిఎసిఎస్ చైర్మన్ రమణరెడ్డి, జడ్పి కోప్షన్ సభ్యులు యు.సుభాష్‌రావు, సర్పంచ్‌లు తిరుమల శ్రీనివాస్, ఇట్టడి గంగారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసనసభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మొబైల్ నెట్ వర్క్ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ సరఫరాపై ఆయా నెట్‌వర్క్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణకు మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ వ్యవస్థ ఒక భాగమని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలోని మారుమూల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఇంటర్నెట్ సరఫరా అయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల నిర్వహణ నేపథ్యంలో నిరంతరంగా ఎలాంటి అంతరాయం కలుగకుండా సిగ్నల్ వ్యవస్థ పటిష్ట పరచాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్త, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్, ఇతర మొబైల్ నెట్ వర్క్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి మద్దతు ప్రకటించిన ఒడ్డెర సంఘం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ మద్దతు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికేనని మండల ఒడ్డెర సంఘం బుధవారం ప్రకటించింది. ఈ మేరకు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కల గంగాధర్ సంఘం వాట్సాప్ గ్రూపులో బీజేపీ, కాంగ్రెస్ వీడియోలు పెడుతూ మమ్మల్ని ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సంఘం సభ్యులంతా 500పైగా గతంలోలొనే నాయకులు ఎర్ర రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన సంగతి గుర్తు చేశారు. వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన మెసేజ్‌లపై నిలదీస్తే తమను దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ప్రవర్తన మార్చుకోకపోతే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మక్కల నాగయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యరద్శి పల్లపు రవీందర్, క్యాషియర్ దండుగుల రాజు, సభ్యులు ఒల్లెపు రవి, పల్లపు రాజేశ్వర్, బోసు సుమన్, గుంజ మహేష్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నవతెలంగాణ - రెబ్బెన



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ సయ్యద్ మోసిన్ అలీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు అనుమానాస్పద ప్రదేశాలు, గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గంగాపూర్ గ్రామ శివారులో 900 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. ఖైర్‌గాంలో గల అక్రమ మద్యం దుకాణాల్లో జరిపిన తనిఖీల్లో ఎర్రం శంకరమ్మను అరెస్టు చేసి 15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేశారు. ఎవరైన గుడుంబా తయారు చేసినా, అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు తెలిస్తే వెంటనే తెలియజేయాలని మోసిన్‌అలీ తెలిపారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. దాడిలో ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాటించాల్సిన ఎన్నికల నియమావళిపై కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ ఓమర్ హుస్సేన్ మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో వందశాతం ఎన్నికల నియమావళిని అమలు జరిగేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పారదర్శకంగా తమ విధులను నిర్వహించాలని చెప్పారు. మార్కెటింగ్, నర్సరీల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో సురేష్ ఎంపీఓ గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డబ్బులకు టికెట్ ఇవ్వలేదు.. ఓట్లు చూసి ఇచ్చాం..

- ధనికునికి.. బీదవానికి మధ్య జరుగుతున్న యుద్ధం
- బొజ్జును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు



సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలో డబ్బులు చూసి ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వలేదని, ఓట్లు చూసి ఇచ్చామని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ ఆర్టీసీ స్థలంలోని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయబేరి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33ఎండ్ల తరువాత నియోజకవర్గ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ అంటే టికెట్లను అమ్ముకునే పార్టీ అని బీఆర్ఎస్ మాట్లాడుతుందని బోజ్జు దగ్గర ఎన్ని కొట్లు తీసుకుని టికెట్ ఇచ్చిందో వారే తెల్చిచెప్పాలన్నారు. డబ్బులు చూసి పార్టీ టికెట్ ఇవ్వలేదని, ఓటు బ్యాంకును చూసి పార్టీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆదివాసులు, లంబాడాలు నాకు రెండు కండ్లలాంటోల్లని, వారికి ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుడితే బీఆర్ఎస్ పార్టీ ఆ ప్రాజెక్టులకు మరమ్మతులు, కాలువలు, ఇతర సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. తుమ్మిడిహెట్టిలో ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అక్కడి భూములకు సాగు నీరు అందుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తే కేసీఆర్ సీఎం అయ్యాక మహారాష్ట్ర భూములను అడ్డంపెట్టుకొని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తీసుకేల్లి మేడిగడ్డ, అన్నారం, సున్నారం వద్ద నిర్మాణాలను రూ. లక్ష 50వేల కోట్లతో చేపట్టి, లక్ష కోట్లకు అవినీతికి పాల్పడ్డ ఘనత కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్దాలేనని నియోజకవర్గానికి ఎం చేశారని ప్రశ్నించారు. కడెం ప్రాజెక్ట్, సదర్‌మాట్ ప్రాజెక్టు, ఐటీడీఏ, ఇతర వాటిని కాంగ్రెస్ హయంలో ఏర్పాటు చేస్తే కడెం ప్రాజెక్టుకు మరమ్మత్తులు, సదర్‌మాట్ ప్రాజెక్టుకు కాలువ నిర్మాణం, ఐటీడీఏను ప్రక్షాళన చేసే విషయంలో కేసీఆర్ విఫలం అయ్యారన్నారు. ధరణి పోర్టల్ ముసుగులో హైదరాబాద్ చుట్టు 10వేల ఎకరాలు మింగిన ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. రైతులపై కేసీఆర్‌కు నిజంగా ప్రేమ ఉంటే ఖానాపూర్ నియోజకవర్గంలో రైతులకు 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తున్నారా.. ఇస్తే సబ్ స్టేషన్‌కి వెల్లి లాక్‌బుక్‌లను పరిశీలిద్దామని మీకు వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. 24గంటల కరెంట్ ఇస్తే ఖానాపూర్, కొడంగల్లో నేను, బొజ్జు నామినేషన్లు వేయమని సవాళ్లు విసిరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళఖాతంలో కలిపి దాని స్థానంలో నూతన పోర్టల్‌ను తీసుకవచ్చి కౌలు రైతుల నుంచి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గిరిజనేతరులు సాగు చేసుకునే భూములకు ఫహాణీలు, బ్యాంకు రుణాలు, రైతుబంధు వర్తించే కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా అడవుల జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటుగా, ఇంద్రవెల్లి ఘటనలో అమరులైన కుటుంబాలను ఆదుకుని న్యాయం చేస్తామన్నారు. దీనితో పాటుగా పార్టీ ఆరు గ్యారంటీల పథకాలను పక్కాగా అమలు చేస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాడలంటే పెద బిడ్డ వెడ్మ బొజ్జును భారీ మెజారిటీతో గెలిపించి సత్తా చాటాలన్నారు.

ధనికునికి.. బీదవానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు...

ఉట్నూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి యాత్రలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు మాట్లాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ బీనామి అయిన ధనికునికి, నిరుపేద ఆదివాసీ బిడ్డకు మధ్య జరిగే ఎన్నికలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోని ఓటు వేయాలని సూచించారు. ప్రజలు తనను ఆశీర్వాదించి గెలిపించిన వెంటనే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ముఖ్యంగా గిరిజనేతర సమస్యలను సైతం పరిష్కరిస్తానని తెలిపారు. ఉట్నూర్ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విజయభేరి యాత్ర సభకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన జన్మదిన దినం సందర్భంగా ఆయన పాల్గొనడం శుభ సూచికమని ఆయన ఆశీర్వాదంతోనే ఈ రోజు టికెట్ వచ్చిందని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయని బొజ్జు అన్నారు.

ఉట్నూర్‌లో జరిగిన సభకు కేవలం బొజ్జుపై అభిమానంతో వచ్చారే తప్పా డబ్బులకు ఆశ పడి వచ్చినవాళు కాదని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని అన్నారు. పార్టీలో పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు చేరారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి బొజ్జు ర్యాలీగా వెల్లి తన నామినేషన్ పత్రాన్ని ఆర్వో జివాకర్‌రెడ్డికి అందించారు. అంతకుముందు సభ వేధికపై కళాకారులతో ఆట పాటలు నిర్వహించారు.

సభలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జీ, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్, నియోజకవర్గ ఎమ్మెల్యే రేఖా నాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటా : వన్నెల అశోక్



నవతెలంగాణ-తాంసి

బోథ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి బరిలో ఉంటానని డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. బుధవారం ఆయన ప్రకటించారు. తనకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కొందరి స్వలాభం కోసం పది రోజుల తర్వాత బీఫామ్ ఇవ్వకపోవడంతో బోథ్ నియోజకవర్గం నాయకుల, కార్యకర్తల, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకుల కోరిక మేరకు ఈనెల 10న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసి బరిలో ఉంటానని అన్నారు. నాకు జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుదామన్నారు. నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గిరి గూడాల్లో భోగి సందడి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని గిరి గ్రామాల్లో భోగీ సందడి నెలకొంది. బుధవారం మండలంలోని లక్కుగూడ (పిప్పిరి), గ్రామంలో పటేల్ కొరెంగ లక్కు ఇంటి వద్ద ఎత్మాసూర్ పూజలు చేశారు. ముందుగా గుస్సాడి వేషధారణలు ఉపయోగించే నెమలి ఈకలతో చేసిన టోపీ, డప్పులు, రోకలి, గజ్జెలు, తుడుమ్, పర, గుమెల, టప్పల్, తదితర సామాగ్రిని, ఒక చోటికి పేర్చారు. అనంతరం టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఊయిక విష్ణు, గ్రామస్తులు దేవారి కొరెంగా గంగారాం, మహాజన్ ఆత్రం లాల్ దేవ్, సంభు, జ్యోతిరామ్, మోహన్ ఆధ్వర్యంలో వారి ఆచార సాంప్రదాయం ప్రకారం ఎత్మాసూర్ పూజలు చేశారు. ఈ పూజల అనంతరం గస్సాడి వేషధారణ వేస్తారు. వారం రోజుల పాటు గుస్సాడీలు దీపావళి ఉత్సవాలు జరుపుకుంటారు. ఒక ఊరి నుంచి మరో ఊరికి దండారి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు జబాడే దళిత్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. అదేవిధంగా అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరగా వారందరికీ ఎమ్మెల్యే గులాబి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెపుతూ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. బూటకపు హామీలు ఇవ్వడం, వాటి అమలులో విఫలమవడం ఆ పార్టీకి అలవాటేనన్నారు. అందుకు కర్ణాటకలో ప్రస్తుత పరిస్థితులే నిదర్శనమని అన్నారు. అక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని హామీ ఇచ్చి మగవాళ్ల మాత్రమే బస్సులు ఎక్కాలని బోర్డులు పెట్టడం వారి అసమర్థ పాలనకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన కీలక నాయకుడే రోడ్‌షోలో స్వయంగా అయిదు గంటల విద్యుత్తు ఇస్తున్నామని మాట్లాడటం, ఆ వీడియో వైరల్‌గా మారి చర్చనీయాంశంగా మారిందన్నారు. ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకుని కోట్లకు పడగలేత్తారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, లింగారెడ్డి, బుట్టి శివకుమార్, ధమ్మపాల్, యాసం నర్సింగ్‌రావు, కొండ గణేష్, పర్వీన్, సంజయ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న



జోగు రామన్నను గజమాలతో సత్కరించిన నిరాల గ్రామస్తులు

నవతెలంగాణ-జైనథ్

అన్ని వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం నిరాల గ్రామంలో రోడ్‌షో కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గజమాలతో సత్కరించి, పూలవర్షంతో వారి అభిమానాన్ని చాటుకున్నారు. అంతకుముందు దీపాయిగూడకు వెళ్లి నామినేషన్ సందర్భంగా తల్లిదండ్రుల చిత్రపటాల వద్ద ఆశీర్వాదాన్ని పొందారు. మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్‌రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ అధ్యక్షులు లింగారెడ్డి, గ్రామ సర్పంచ్ సునంద ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని రాస్పెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో బుధవారం రాస్పెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో కళాజాత బృందం వారిచే ఆర్థిక సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు వివరాలు, బ్యాంకు పథకాలు, స్కీమ్‌పై, సామాజిక భద్రత పథకాలు సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదురహిత లావాదేవీలపై, సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా మాటలు, పాటలు, మ్యాజిక్ షో ద్వారా కళాజాత బృందం వారు తెలియజేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్ సాయిచరణ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సాయిచరణ్, ఫీల్డ్ ఆఫీసర్ జగదీష్, సాయి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, కళాజాత బృందం సభ్యులు ఎం తేజకుమార్, వేణు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు



నవతెలంగాణ-బెజ్జూర్

2021-23 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ చట్టంలో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఓ సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2276 పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ బృందం సేకరించిన నివేధికలను పరిశీలించారు. మొత్తం 2021-23 సంవత్సరానికి గాను రూ.4.92 కోట్లు రూ.534 పనులు జరుగగా మెటీరియల్ కింద రూ.90,93 లక్షల పనులు జరిగినట్టు డీఆర్‌డీఓ తెలిపారు. ఇందులో మొత్తం రూ.5.83 కోట్లకు సంబంధించిన ఆడిట్ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఉపాధిహామీ చట్టంలో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గతంలో అవకతవకలకు పాల్పడిన వారికి రికవరీ చేశామన్నారు. మొత్తం 22 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆడిట్ జరగాల్సి ఉండగా సాయంత్రం వరకు 15 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇన్‌హౌజ్ మోడల్‌లో సామాజిక తనిఖీ చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో ఎంపీడీఓ మాధవి, ఏపీఓలు చంద్రయ్య, బుచ్చయ్య, ఎస్ఆర్‌పీ భగవాన్, ఎంపీఓ రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సరైన నాయకున్ని ఎన్నుకోవాలి

- కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలి
- గతంలో లేని విధంగా జిల్లాను అభివృద్ధి చేశాం
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో ప్రధానమైనదని ఆలోచించి ఓటు వేసి ఐదేండ్లు పరిపాలించే సరైన నాయకున్ని ఎన్నుకోవాలని సీఎం కేసీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కనగల మైదానంలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజయరై మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన తప్పుతో 58 ఏళ్లు కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లలో అభివృద్ధి చేస్తే ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్న చేస్తున్న కాంగ్రెస్‌ను బంగాళకాతంలో కలపాలని పిలుపునిచ్చారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన కుమురంభీం పేరుతో జిల్లా ఏర్పాటు చేశామన్నారు. దీనితో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయం మెడికల్ కళాశాలతో పాటు అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీతో 13 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణ తెచ్చుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల్లో ప్రజలు ఆగం ఆగం కావద్దన్నారు అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి రద్దు





చేస్తామని చెబుతున్నారని అదే జరిగితే రైతుబంధు రైతు బీమా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనితో మళ్లీ వీఆర్‌ఓ, రెవిన్యూతో పాటు, వ్యవసాయ అధికారులతో కూడిన మధ్య దళారీ వ్యవస్థ ప్రారంభమవుతుందన్నారు. రాహుల్ గాంధీకి వ్యవసాయం గురించి తెలియదంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రంలోకి వలసలు ఉండేవని ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే వారి సంఖ్య పెరిగిందన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం పోడు పట్టాలు పంపిణీ చేయడంతో పాటు వాటికి రైతు బీమా, రైతుబంధు వర్తింపచేసినట్లు, త్రీఫేస్ కరెంటు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాకాలంలో మంచం పట్టిన మన్యం అంటూ కథనాలు వచ్చేవని ప్రస్తుతం గత పది సంవత్సరాల్లో ఇటువంటివి కనిపించకపోవడం తాము చేసిన అభివృద్ధి అని పునరుద్ఘాటించారు. ముస్లింల సంక్షేమ కోసం కాంగ్రెస్ పాలన మొత్తం మీద రాష్ట్రంలో రూ.900 కోట్లు ఖర్చు చేస్తే 10 ఏళ్లలో తాము 1200 కోట్లు ఖర్చు చేసామన్నారు. తాము అధికారంలోకి వస్తే రానున్న ఐదేళ్లలో పెన్షన్ ప్రతి సంవత్సరం 500 పెంచుతామన్నారు. మార్చి తర్వాత అన్ని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కారు చీకట్లు కమ్ముకుంటాయని దీనికి నిదర్శనమే కరెంటు మూడు గంటలు చాలంటు ప్రస్తుత పీసీసీ, మాజీ పీసీసీ అధ్యక్షులు మాట్లాడిన మాటలన్నారు. రానున్న ఎన్నికల్లో కోవా లక్ష్మి అభ్యర్థిత్వాన్ని బలపరిచి పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వదులుకున్న ఆత్రం సక్కుకు, ఇటీవలే పార్టీలో చేరిన మరుసుకోల సరస్వతికి రానున్న రోజుల్లో మంచి స్థాయిలో ఉండేలా పదవులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికిగాను అడ ప్రాజెక్టు కెనాల్ కోసం రూ.50 కోట్లు వట్టివాగు కెనాల్ కోసం రూ.150 కోట్లు నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. అలాగే గుండి బ్రిడ్జి లక్మాపూర్ బ్రిడ్జి, శంకర్ లొద్ది బ్రిడ్జి కి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి హామీ ఇవ్వాలన్నారు. సభ వేదికపైకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సరస్వతి పాదాభివందనం చేశారు. గాయకుడు ఏపూరి సోమన్న ఆట పాట సభకు వచ్చిన వారిని అలరించింది. ఆయన పాటకు కోవలక్ష్మీతో పాటు స్టేజి మీద ఉన్న నాయకులు డాన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కేసీఆర్ రాగానే దేశ్‌కి నేత అని పాట పాడడంతో సభ ఒక్కసారి జై కేసీఆర్ నినాదాలతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఆదిలాబాద్ జడ్పీ చైర్ పర్సన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీ గెడం నగేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ రావు, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు సరస్వతి, కిషన్ పాల్గొన్నారు.



ఆర్పీఐ అభ్యర్థిగా జాడి దీపక్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ నియోజకవర్గం ఆర్పీఐ పార్టీ అభ్యర్థిగా జాశి దీపక్‌కు ఆ పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ అంబేద్కర్ బీఫాం అందజేసినట్టు జాడి దీపక్ తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో మూడు సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 17 న ప్రకాష్ అంబేద్కర్ కాగజ్‌నగర్‌లో రోడ్ షో నిర్వహిస్తారని, ప్రజలు, అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున వచ్చి రోడ్ షోను విజయవంతం చెయ్యాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 రాష్ట్ర అధ్యక్షులు వేమునురి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం యాజమాన్యం విద్యుత్ సంస్థలోని కార్మికులకు ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల ప్రమోషన్లు త్వరగా పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో టీఈఈ 1104 యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 1104 యూనియన్ అసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కె.విలాస్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సీహెచ్ రమేష్, జిల్లా కార్యదర్శి వెంకటేష్, అదనపు కార్యదర్శి టి. మహేందర్ పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షాన్ని ఓడించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-ఆదిలాబాద్

మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడిచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ళ ఆశయ్య పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని ఎర్మ పున్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పైళ్ల ఆశయ్య హాజరై మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటికరణ చేయడం జరుగుతుందన్నారు. కార్మికుల రక్షణకు ఉన్న చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తెచ్చింది బీజేపీ ప్రభుత్వం అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 72 స్కీములను ప్రయివేటీకరణ చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఇది జరిగితే ఈ స్కీముల్లో పనిచేసే కోట్లాదిమంది



ఉద్యోగ, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రోజు పని చేసే కార్మికులకు కనీస వేతనం లేకుండా ఉద్యోగ భద్రత ఇవ్వకుండా రక్షణ కల్పించకుండా ప్రభుత్వం తెచ్చేటువంటి చట్టలతో కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారయాన్నారు. ఇప్పటికైనా ప్రజలు అలోచించి ప్రజా, కార్మిక, సమస్యలు పరిష్కరించే వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య పోరాట శక్తులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, ప్రకాష్, రాజేశ్వరి, పున్నం, అశోక్, రాజారాం, అశోక్, శ్రీనివాస్, దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-భీమారం

మండలంలో విద్యుత్ సరాఫరాలో గురువారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కుమార స్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. భీమారం సబ్‌స్టేషన్‌కు వచ్చే లైన్‌కు ప్రత్యామ్యాయంగా నూతన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనులు జరుగుతున్న క్రమంలో సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యూత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
మంచిర్యాల
గురువారం నవంబర్, 9, 2023

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-భీమారం

మండలంలోని బూరుగుపల్లి, ఖాజీపల్లి గ్రామాల నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం స్థానిక చెన్నూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఖాజీపల్లి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు, బూరుగుపల్లి గ్రామానికి చెందిన లంబాడీకుల పెద్ద, వార్డు సభ్యులు భుక్య శంకర్ నాయక్ బాల్క సుమన్ సమక్ష్యంలో గులాభీ కండువాలు కప్పుకున్నారు. శంకర్ నాయక్ గత నాలురోజుల క్రితం గడ్డం వివేక్ సమక్ష్యంలో కాంగ్రెస్‌లో చేరి తిరిగి బీఆర్ఎస్‌లో చేరాడు. కార్యక్రమంలో నాయకులు జలంపెల్లి తిరుపతి, నీలాల తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మామిడిపెల్లి సర్పంచ్ గడ్డం రాజయ్యతో పాటు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నలిమెల భుజంగరావు, కోఆప్షన్ సభ్యుడు ధనిశెట్టి మల్లయ్య లు బుధవారం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, నాయకులు గడ్డం చిన్న మల్లయ్య, అక్కల కృష్ణ, బత్తుల రమేష్, కొత్తపల్లి లింగన్న, సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

తెలంగాణను గోస పెట్టింది కాంగ్రెసే

- బెల్లంపల్లి ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కాసిపేట

తెలంగాణను ఏండ్లుగా గోస పెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో ఆశీర్వాద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల వేళ డబ్బుల సంచులతో వచ్చే వాళ్లని నమ్ముకుంటే నట్టేట ముంచుతారన్నారు. మీ మధ్య ఉండే ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను గెలిపించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ 55 ఏళ్ల పాటు పరిపాలించిందని, కాని గోసలు, సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. చెన్నూరులో చెల్లని రూపాయి బెల్లంపల్లిలో చెల్లుతుందా? అని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌ని ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు రాష్ట్ర భవిష్యత్తును మారుస్తుందని, ప్రతి ఒక్కరూ అలోచించి ఓటు వేయాలని, లేదంటే గోస పడతారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రేవంత్, బట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ గెలిపిస్తే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తామని అంటున్నారని, ధరణి లేకుంటే దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. అలా ఇబ్బందిపెట్టే కాంగ్రెస్ వాళ్లను ఓటు హక్కుతో బంగాళాఖాతంలో కలపాలని, దేశంలోనే 24గంటల కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.



ప్రధాన మంత్రి సొంత రాష్ట్రంలో కూడా 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకొచ్చిన న్యాయమైన కోర్కెలను నెరవేరుస్తానని, ఎమ్మెల్యేగా దుర్గం చిన్నయ్యను మరోసారి గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ టికెట్లను అమ్ముకుంటున్నారని, రేపు రాష్ట్రాన్ని అమ్మకోడని రుజువు ఏంటని ప్రశ్నించారు. సూట్‌కేసులు, డబ్బుల సంచులతో ఎన్నికల సయయంలో కనిపించే వారిని నమ్మవద్దన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బోడ జనార్ధన్, సీపీఐ(ఎంఎల్) నాయకుడు సబ్బని కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి సీఎం కేసీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ 1995 నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం, ప్రజల అండతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, మూడోసారి కూడా ఆదరించాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, సింగరేణిలో 7000 ఇళ్ల పట్టాలు ఇప్పించానని పేర్కొన్నారు. 100 పడకల ఆసుపత్రి, ఫుడ్ ప్రాసెస్ యూనిట్, ఐటీ కంపెనీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బహిరంగ సభలో చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆత్మ చెర్మెన్ మల్లెపూల సుభాష్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బుచ్చన్న, నాయకులు ధీటి దేవిదాస్, గంగాధర్, గోపాల్ పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి కాపాడుకోవాలి



నవతెలంగాణ-దండేపల్లి

దక్షిణ భారత దేశంలో ఏకైక ఆదివాసీ గిరిజన దేవాలయంగా పేరుగాంచిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది తీరాన గల పద్మల్ పురి కాకో దేవాలయంలో ఆదివారం దండారి ఉత్సవాల్లో భాగంగా గుస్సాడీ దర్బార్ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరైనట్లు ఆలయ చైర్మన్ కుడిమేత సోము తెలిపారు. దండారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గిరిజన ధర్బార్ నిర్వహించారు. ముందుగా గిరిజనులు సమీప గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి తమ సాంప్రదాయ వేశాదారనతో దండారిలతో కుటుంభ సమేతంగా ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి యేట దీపావళి పొండగకి ముందు నిర్వహించే ఈ ఉత్సవాలను గిరిజనులు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు. గిరిజనులు తమ సంప్రదాయ వేషదారణతో చేసిన గుస్సాడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దండారి ఉత్సవాలకు ముఖ్య అథితులుగా రామగుండం పోలీస్ కమిషనర్ రేమా రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన తెగలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఉందని గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని వారు అన్నారు. కేస్లాపూర్, జోడేఘాట్ దర్బార్‌లకు అధికారులు నాయకులు వచ్చి వెళ్తున్నారు. ధర్బార్‌లో విన్నవించిన సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. నేటికి కనీస వసతులు లేని గిరిజన గ్రామాలున్నాయని వారిని పట్టించుకునే వారు లేరన్నారు. ప్రభుత్వం అన్ని పండగలకు నిధులు ఇస్తున్నట్లే ఏడాదికోసారి వచ్చే తమ పండగకు కూడా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కర్యక్రమంలో సర్పంచ్ చిట్ల లింగవ్వ, ఎంపీటీసీ సభ్యుడు పసర్తి అనిల్ కుమార్, నడిపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కుడిమేత సోము, సభ్యులు తుడుం దెబ్బ జిల్లా నాయకుడు సొయం జంగు, ప్రధాన్ సంఘం జిల్లా నాయకుడు అడయి కాంతరావు, కుమురం లింగారావు, పెంధ్రమ్ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు నాయకులు రామ్ పటేల్, దామ్ పటేల్, జలపతి, మోహన్ రావులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఓటు హక్కు కీలకం



నవతెలంగాణ-దండేపల్లి

మెరుగైన సమాజనిర్మాణానికి ఓటు హక్కు అనేది కీలమని భావించినపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి అన్నారు. బుధవారం దండేపల్లిలో ఓటు హక్కు వినియోగంపై కళాజాత బృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై కళాజాత బృందం పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందని అన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, కాబట్టి అర్హులందరు ఓటు హక్కును ఉపయోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కు ద్వారానే ఒక మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందని ఈ దిశగా ఓటర్లు అందరూ చైతన్యవంతులై తమ ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా భావించాలన్నారు. ముఖ్యంగా యువత తమ సమీపంలోని ప్రజలందరూ కూడా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిని చైతన్యవంతం చేసి పోలింగ్ శాతం పెరిగేలా తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీఎలు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సభకు తరలిన మండల నాయకులు

జన్నారం : ఉట్నూర్‌లో బుధవారం నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభకు బుధవారం మండలం నుంచి వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ మాట్లాడుతూ, ఈసారి కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కాంగ్రెస్ వస్తేనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారు అన్నారు. దొర పాలనను అంతమొందించాలంటే ప్రతి ఒక్కరు చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు, మురిమడుగు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యాలయాలను ఆ పార్టీ అభ్యర్థి బుక్యా జాన్సన్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలంటే బీఆర్ఎస్ పార్టీ మరోసారి గెలవాలన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. కార్యకమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పెంబి జడ్పీటీసీ జాను భాయ్, వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యల ప్రస్తావనేది..?

- సీఎం ఉపన్యాసంలో సమస్యల ఊసే లేదు
- వార్ధా ప్రాజెక్టుపై మాట కూడా మాట్లాడని సీఎం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ స్థానిక సమస్యల గురించి ప్రస్తావన తీసుకురాకపోవడం స్థానికులను నిరుత్సాహానికి గురి చేసింది. సీఎం ఉపన్యాసానికి ముందు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఓబీసీ సర్టిఫికెట్లు, నియోజకవర్గంలో అడ, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, నియోజకవర్గంలో మరో 15 వంతెనల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని ఆయన సీఎం దృష్టికి తీసుకొచ్చారు. జూనియర్ కళాశాలలు ఉన్నా, డిగ్రీ కళాశాలలు లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అయినా సీఎం కేసీఆర్ ఈ సమస్యల గురించి ప్రస్తావించకుండానే తన ఉపన్యాసాన్ని ముగించారు. ముఖ్యంగా కుమురంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు సాగు నీరందించే వార్ధా ప్రాజెక్టు గురించి సీఎం కేసీఆర్ స్పష్టత ఇస్తారని ఈ ప్రాంత రైతాంగం ఎదురుచూసింది. కాని దాని గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం రైతాంగాన్ని నిరుత్సాహానికి గురి చేసంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించిన తర్వాత ప్రత్యామ్నాయంగా వార్ధా ప్రాజెక్టును తెరమీదికి తీసుకొచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కొన్నేళ్లుగా డీపీఆర్ రూపల్పనకే పరిమితమైంది. ఇప్పటి వరకు డీపీఆర్ కూడా తయారు కాకపోవడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణంపై రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి. సీఎం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై స్పష్టత ఇస్తారని భావించారు.

ఎస్పీఎం కార్మికుల సమస్యలపై కూడా ఊసే లేదు

సిర్పూరు పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై కూడా సీఎం కేసీఆర్ స్పందించలేదు. రాష్ట్ర ప్రభుత్వ కృషి వల్లే మిల్లు పున:ప్రారంభమైందని ప్రభుత్వం చెప్పుకుంటున్నా ఆ మిల్లులో కార్మికులు పడే బాధల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ మిల్లులో స్థానికులను కాదని స్థానికేతరులను యాజమాన్యం పనిలోకి తీసుకుంటోంది. దీనిపై ఆందోళన కొనసాగుతోంది. ముఖ్యంగా మిల్లు పున:ప్రారంభమైనా ఇప్పటి వరకు 200 మంది వరకు పర్మినెంట్ కార్మికులను యాజమాన్యం విధుల్లోకి తీసుకోలేదు. వీరు కూడా ఆందోళన చేపడుతున్నారు. 2018 ఎన్నికల సమయంలో కాంట్రాక్టు కార్మికులకు ఇస్తానని చెప్పిన రూ.35 వేలు ఇవ్వకపోగా నామమాత్రంగా రూ.10వేలు చేతిలోపెట్టి కార్మికులను మోసం చేయడం పట్ల కూడా కార్మికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ సమస్యలపై సీఎం కేసీఆర్ మాట్లాడుతారని భావించినా ఆ దిశగా సీఎం ఉపన్యాసం లేకపోవడం కార్మికులను నిరాశకు గురి చేసింది.

సర్‌సిల్క్ మిల్లు పునరుద్ధరణపై హామీ

మూతపడ్డ సర్‌సిల్క్ మిల్లు పునరుద్ధరణపై సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సర్‌సిల్క్ మిల్లును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇపుడు మళ్లీ సీఎం కేసీఆర్ సర్‌సిల్క్ మిల్లును పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడం కార్మికుల్లో ఆశను రేకెత్తిస్తోంది.

అమరవీరుల ఆశయ సాధనలో ముందుండి పోరాడాలి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య
- పాత తర్లపాడు గ్రామంలో అమరవీరుల వర్ధంతి సభ



నవతెలంగాణ-ఖానాపూర్

అమరవీరుల ఆశయ సాధనలో ముందుండి పోరాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. బుధవారం అమరవీరుల సంస్మరణ సభను ఖానాపూర్ మండలంలోని పాత తర్లపాడు గ్రామంలో ప్రజాపంథా పార్టీ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరులు భూమికోసం పేదప్రజల విముక్తికోసం తమ అమూల్యమైన ప్రాణాలను ఈ దేశం కోసం అర్పించారని అన్నారు. ఈ దేశంలో నిజమైనటువంటి స్వాతంత్ర్యం రాలేదని, ప్రజలు అనేక రకాల దోపిడీ, పీడనలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఉద్యమించాలని అప్పుడే అమరవీరులకు నిజమైన నివాళ్లు అర్పించినవాళ్లమవుతామని అన్నారు. ఈ వర్ధంతి సభలో ఏఐపీకేఎస్ మండల నాయకులు జక్కుల రాజన్న, మున్వర్ ఖాన్, లక్ష్మణ్, కుమురం మంతు, భగవంత్ రావు, పూసం గోపాల్, నాగోరావ్, మధవరావ్, జానాబాయి, లక్ష్మిబాయి, దేవుబాయి, అమృతబాయి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సును బుధవారం మంచిర్యాల ఎక్స్ రోడ్‌లోని శివాజీ చౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి ప్రయాణికులకు రోడ్డు భద్రతపై వివరించారు. రోడ్డు దాటుతున్నపుడు రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. మోటార్ బైక్ నడిపే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు, పిల్లలకు బైక్‌లు ఇవ్వద్దని అన్నారు. పిల్లలు ఏ తప్పుచేసిన బండి ఓనర్‌పైనే కేసు వేయడం జరుగుతుందన్నారు. మనపై మన కుటుంబం ఆధారపడి ఉందని తెలియజేశారు. ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు మంచి శిక్షణ పొందిన వారు ఉంటారని, సురక్షితంగా గమ్యం చేరుస్తారని తెలిపారు. అలాగే తీర్థ యాత్రలకు, వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రతిపాదికన బస్సులు ఇస్తామని, ప్రయాణికులు వీటిని ఉపయోగించు కోవాలన్నారు. ఆర్టీసీ బస్సులో ఎక్కడికి వెళ్లాలన్న, వెళ్లాల్సిన బస్సు ఎప్పుడు వస్తుంది, ఎక్కడుందని తెలుసుకోవడానికి మీ మొబైల్‌లో గమ్యం యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అలాగే పలువురికి ముఖ్యమైన కూడలిలో గమ్యం యాప్ ఇన్‌స్టాల్ చేసి ఇచ్చారు. కార్యక్రమంలో వీబీలు టీవీ రమణ, కేఎం రెడ్డి, ఎల్.నర్సయ్య, పి.నారాయణ, మల్లయ్య, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారి ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సిబ్బందికి, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సంబంధించిన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. జిల్లాలో మూడు నియోజక వర్గాలు నిర్మల్, ముదోల్, ఖానాపూర్ నియోజక వర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను ఎంపిక చేసి కేటాయించారన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 4,735 మంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కుమార్తె మాధురి అన్నారు. బుధవారం ఎన్నిక ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ కాలనిలోని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భగవంతుడి ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అన్నారు. అధికారంలోకి రాగానే దేవాలయాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించి, అభివృద్ధికి తోడ్పాడాలని ఆమె కాలనీ వాసులను కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు విస్తృత ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ముధోల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని భారీ మెజార్టీతో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ నూకం రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, మండల బీఆర్ఎస్ కన్వీనర్ కొర్వా శ్యామ్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీ, మాజీ ఉపసర్పంచ్ లాల్‌మియ, జ్ఞాని పటేల్, మల్లయ్య యాదవ్, ఫసియుద్దీన్, కృష్ణ, నర్సయ్య బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- చెన్నూరు అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామపంచాయతీల వారిగా అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ చెన్నూర్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలంలోని శెట్‌పల్లి, కుందారం బెజ్జాల, నర్సింగాపూర్‌లలో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని, ప్రజల అవస్థలను సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరిక

శేట్‌పల్లిలో మాజీ సర్పంచ్ అన్నం వెంకన్న, మాజీ ఎంపీటీసీ జాగేటి గోపాల్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ గౌడ్‌తో పాటు వార్డు సభ్యులు నక్కపోసక్క, కొరకొప్పుల శ్రవణ్ గౌడ్, లక్కాకుల దుర్గమ్మ, తుంగపిండి రాజేష్ గ్రామానికి చెందిన యువకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా బెజ్జాల గ్రామపంచాయతీ సర్పంచ్ జయపాల్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చల్ల ప్రకాష్, ఉప సర్పంచ్ డేగ రామన్న, సొల్లురి రాజేష్, భాగ్యలక్ష్మి సుమలత లక్ష్మితో పాటు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. నర్సింగాపూర్ గ్రామపంచాయతీలో స్థానిక సర్పంచ్ పండుగ బుచ్చమ్మ ఆధ్వర్యంలో నాయకులు పండుగ రాజన్న, నారాయణ సుభాష్ ఉప సర్పంచ్ అనూష, కోప్షన్ సభ్యులు రాంబాబు లలిత లక్కాకుల స్వామి మాజీ సర్పంచ్ ధర్మపురి తోపాటు యువకులు మహిళలు కాంగ్రెస్ చేరారు. కుందారం గ్రామంలో మాజీ సర్పంచ్ తుమ్మల రామారావు, సంతోషం శేఖర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువకులు భారీగా కాంగ్రెస్ పండుగ కప్పుకున్నారు. గ్రామపంచాయతీల వారిగా రోడ్ షో నిర్వహించిన వివేక్ వెంకటస్వామికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. శెట్టిపెల్లి గ్రామంలో మహిళలు దారి పొడవు ఆటపాటలతో నత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజుద్దీన్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒక్కరోజే 10 నామినేషన్‌లు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బుధవారం 10 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అందులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్న మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నలుగురు సభ్యులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి తమను గెలిపిస్తాయని అన్నారు. తెలంగాణ వాదులుగా ప్రజల్లోకి వెళ్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుకున్నాయని అన్నారు. రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ కు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ధర్మసమాజ్ పార్టీ నుంచి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ బుధవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ నేతృత్వంలో రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా పట్టణానికి చెందిన సూర్యవంశీ నామినేషన్ దాఖలు చేశారు. తమ పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి ఆయన అందజేశారు. కాంగ్రెస్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంది శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మొదటి నామినేషన్ సెట్ పూర్తి చేసినట్లు తెలిపారు. గురువారం రెండు సెట్ల నామినేషన్ వేస్తున్నట్లు ఆయన మీడియాతో తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 50 వేల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్‌లో తప్పకుండా అధికారంలోకి వస్తున్నట్టు తెలిపారు. తనకు టికెట్ ఇచ్చిన రాష్ట్ర, దేశ నాయకత్వానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా కేమ శ్రీనివాస్, నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు పట్టణంలోని ఆదర్శనగర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు చప్పుల మధ్య ర్యాలీ చేపట్టి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రెషర్ కుక్కర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కేమ శ్రీనివాస్ కోరారు. ఇంకా బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ తరపున రెండవ సెట్ నామినేషన్‌ను వేశారు. కాగా మిగితా బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఉయిక ఇందిర, స్వతంత్ర అభ్యర్థులుగా భాను రాజేశ్వర్ రావు, అస్లాం, ఎన్.సుభాష్‌లు తమ నామినేషన్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్రవంతికి అందజేశారు.

అవినీతి అంతం..కాంగ్రెస్ పంతం

నవతెలంగాణ-సారంగాపూర్

బీఆర్ఎస్ అవినీతి అంతం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన 50మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ 60సంవత్సరాల ఆకాంక్ష తెలంగాణ అని, దాన్ని నెరవేర్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుండి కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హాది, ఎస్కే సలీం, రాజారెడ్డి, సురేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి నిరసన సెగ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రానికి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్టును సీనియర్లకు కాకుండా ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన కంది శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించడాన్ని ఖండిస్తూ బుధవారం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకోవడానికి పలువురు నాయకులు ప్రయత్నించారు. స్టేడియంలో హెలిప్యాడ్ వద్దకు వచ్చిన రేవంత్‌ను అడ్డుకునేందుకు స్టేడియం ఎదుట ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అరెస్టు చేసి మావల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గో బ్యాక్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్ రేవంత్ అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు.

నామినేషన్‌కు ముందు సర్వమత ప్రార్థనలు

నవతెలంగాణ-అదిలాబాద్ అర్బన్

నామినేషన్ పత్రాలను అందజేసే ముందు ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం సర్వమత ప్రార్థనలు చేశారు. స్థానిక శాంతినగర్‌లోని సాయిబాబా ఆలయంలో తన సతీమణి రమాబాయితో కలిసి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం సాత్నాల బస్‌స్టాండ్ సమీపంలోని దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లోని పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నుంచి సర్పంచులతో పాటు ఎంపీటీసీలు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

నేడు దివ్యాంగులకు ఎన్నికల అవగాహనా సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో దివ్యాంగులకు ఎన్నికల సరళి, ఓటు హక్కు వినియోగం గురించి అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షులు గంగన్న, నాయకులు ఎండీ జమాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి



నవతెలంగాణ-సారంగాపూర్

అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బిఆర్ఎస్ నాయకురాలు అల్లోల దివ్యారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే గడపగడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజలంతా పార్టీపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. గడపగడపకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట మండల నాయకులు చించోలి ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ మహమ్మద్, సర్పంచ్ సుజాత, నర్సిరెడ్డి, మధుకర్‌రెడ్డి, హైమద్, పిల్లి నాగయ్య, ముత్యం పాల్గొన్నారు.

బోథ్‌లో రెండు నామినేషన్‌లు

నవతెలంగాణ-బోథ్

బోథ్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక రిటర్నింగ్ కార్యాలయం బుధవారం రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి చాహత్ వాజ్పాయ్ తెలిపారు. అందులో స్వతంత్ర అభ్యర్థిగా తొడసం ధనలక్ష్మి, డీఎస్పీ పార్టీ అభ్యర్థిగా ఊయికే ఉమేష్ నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్‌కు వచ్చి వెనుతిరిగిన బీఎస్పీ అభ్యర్థి

బీఎస్పీ అభ్యర్థిగా జంగుబాపు బుధవారం నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చి వెనుదిరిగారు. ఆయన ర్యాలీ చేసుకుంటూ వస్తుండగా ర్యాలీ నుంచి నామినేషన్‌కు రిటర్నింగ్ కార్యాలయానికి వచ్చారు. నామినేషన్ సమయం అయిపోయిందని రిటర్నింగ్ అధికారి తెలుపడంతో ఆయనతో పాటు ప్రతిపాదనకు వచ్చే ఐదుగురు సభ్యులకు నామినేషన్ వేయకుండా తిరిగి వెళ్లారు. నామినేషన్ రేపటికి వాయిదా వేశారు.

రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. బుధవారం ఆదిలాబాద్ డైట్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో ప్రసంగం అనంతరం పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పలువురు ఆయనను శాలువాతో సన్మానించారు. నాయకులతో కలిసి నాగలి పట్టుకొని ప్రజలకు అభివాదం చేశారు.

ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

అసెంబ్లీ ఎన్నికలు మరో 20 రోజుల్లో ఉన్నాయి. ప్రధాన పార్టీలు ప్రచారాలు జోరు మీద ఉన్నాయి. గ్రామాల్లో పర్యటిస్తూ, విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నారు. బుధవారం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ డైరెక్టర్ బాధవత్ పూర్ణ చందర్ నాయక్ మండలంలోని కుమ్మరితండలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మహిళలు కనిపిస్తే అమ్మ ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ కరపత్రాలను అందించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ధావులే బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, ఉపసర్పంచ్ చందర్ ముకుంద్‌రావు, ఇంధల్ ఉన్నారు.

భారీ ర్యాలీతో బొజ్జు నామినేషన్



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విజయభేరి సభ అనంతరం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జు భారీ ర్యాలీగా వెళ్లారు. పార్టీ నాయకులు, అభిమానులు భారీ గజమాలతో బొజ్జును సత్కరించారు. అనంతరం బొజ్జు తన నామినేషన్ పత్రాలను ఆర్వో జివాకర్‌రెడ్డికి అందించారు. అదే విధంగా సీపీఐ(ఎంఎల్), (రెడ్‌స్టార్) ఎమ్మెల్యే అభ్యర్థి పెందూర్ ప్రియాంక కూడా నామినేషన్‌ను ఆర్వోకి అందించారు.